అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 29 మే 2023



## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్



నర్సాపూర్(జి) మండల కేంద్రంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ స్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ చిన్న రామయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయాల్లో పెనుమార్పులు తెచ్చారని అన్నారు. సినిమాల్లో నటించిన వ్యక్తి మొదటి సారి సీఎం పదవిని చేపట్టి సంచలనం సృష్టించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోండ్ర రేఖా రమేష్, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర స్థాయిలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చడం అభినందనీయమని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మార్షల్ ఆర్ట్స్ ఆఫ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొని, ఉత్తమ ప్రతిభ కనబర్చగా వారిలో 8 మందికి బ్లాక్ బెల్ట్ రావడం పట్ల ఆదివారం జిల్లా కేంద్రంలో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మార్షల్ ఆర్ట్స్ ఒక ఆత్మరక్షణ కోసమే ఉపయోగపడేదని అన్నారు. కానీ ప్రస్తుతం ప్రపంచ స్థాయి క్రీడల్లో, ఒలింపిక్ క్రీడల్లో దీనికి గుర్తింపు లభించడంతో చాలా అవకాశాలు ఉంటాయని అన్నారు. ఉద్యోగాల్లో, ఎడ్యుకేషన్‌లో సైతం రిజర్వేషన్లు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు రవికాంత్, శిక్షకులు పాల్గొన్నారు.

# ఐటీఐలో చేరండి.. ఉపాధి అవకాశాలు పొందండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లోని కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్- ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులకై నోటిఫికేషన్ వెలువడింది. ఎన్‌సీవీటీ విధానంలో కోర్సులు ఆగస్టులో ప్రారంభమవుతాయి. ట్రేడ్‌ను అనుసరించి కోర్సు వ్యవధి ఏడాది/ రెండేళ్లు. అభ్యర్థులు తాము ఎంచుకొన్న ఐటీఐ సంస్థలు, ట్రేడ్‌ల ప్రాధాన్యక్రమాన్ని దరఖాస్తులో సూచించాలి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. క్రాఫ్ట్స్‌మెన్ ట్రెయినింగ్ స్కీం కింద శిక్షణ ఇస్తారు. కోర్సులో భాగంగా ప్రాక్టికల్ ట్రెయినింగ్, థియరిటికల్ ట్రెయినింగ్, ట్రేడ్ థియరీ, వర్క్‌షాప్ క్యాలిక్యులేషన్స్ సైన్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఉంటాయి. ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ నేర్పిస్తారు. లైబ్రరీ సౌకర్యం ఉంది. ఇతర కరిక్యులర్ యాక్టివిటీస్ కూడా ఉంటాయి.

**షెడ్యూల్ వెబ్సైట్ వివరాలు :** ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 17 నుండి జూన్ 10 లోపు ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు వెబ్ ఆప్షన్స్ సబ్మిట్ చేయాలని ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్/కన్వీనర్ సుజాత తెలిపారు. 8వ తరగతి పూర్తి చేసిన వారికి కొన్ని ట్రేడ్ లలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి అన్ని ట్రేడ్ లలో చేరే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఐటీఐ.తెలంగాణ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా మీ దరఖాస్తులను, పూర్తి చేయాలని కోరారు. దరఖాస్తు చేసుకునే సమయంలోనే, మీ ధ్రువ పత్రాలను కూడా అందులోనే ఉంచుకోవాలని తెలిపారు. (ఒరిజినల్ మాత్రమే) ఆన్ లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా మీ మార్కులను బట్టి మరియు సామాజిక వర్గాలను బట్టి మీరు ఎంచుకున్న ట్రేడ్/ ఐటీఐకి అర్హులైతే మీకు సీట్ కేటాయింపు జరుగుతుందన్నారు.

**అర్హత:** ట్రేడ్‌ను అనుసరించి ఎనిమిదోతరగతి/ పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 2023 ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల

**ట్రేడులు :** తమ కళాశాలలో ఎలెక్ట్రీషియన్, సివిల్, వెల్డర్, స్టెనో గ్రాఫి, డ్రెస్ మేకింగ్, కోప ఆరు రకాల ట్రేడులు అందుబాటులో ఉన్నాయని, ఎలక్ట్రీషియన్, సివిల్ కోర్సులు రెండు సంవత్సరాల కాలం వరకు మిగతావి ఒక సంవత్సరం వరకు ఉంటుందన్నారు. ఈ ట్రేడులకు సంబంధించిన అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని కావున విద్యార్థులు ఐటిఐ కళాశాలలో చేరి తమ బంగారు భవిష్యత్తును ఎంచుకోవాలని సూచించారు.

**ఐటీఐ అంటే ఏమి ..?**

ఐటీఐ అనగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్. ఈ ఇనిస్టిట్యూట్లను పోస్ట్ సెకండరీ స్కూల్స్ అని కూడా అంటారు. మన దేశంలో యువ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడిచే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ సంస్థ ఈ కోర్సులను ఆఫర్ చేస్తుంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ సంస్థ గుర్తింపు పొందిన ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లు నేడు ప్రతీ నగరంలోనూ ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఐటీఐలతో పాటు ప్రైవేటు ఐటీఐలు కూడా ఉన్నాయి. ఐటీఐల ప్రధాన లక్ష్యం యువతకు స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడంతో పాటు పరిశ్రమలకు అత్యున్నత నైపుణ్యం కలిగిన కార్మికులను అందించడం. ఐటీఐలలో చేరాలంటే కనీసం విద్యార్హత పదవ తరగతి (కొన్ని కోర్సులకు 12 వ తరగతి లేదా ఇంటర్మీడియట్). కానీ కొన్ని ప్రత్యేకమైన కోర్సులకు ఎనిమిదవ తరగతిని కూడా కనీస అర్హతగా ప్రభుత్వం నిర్ణయించింది.

**ఉపాధి అవకాశాలు**

నేడు ఐటీఐ కోర్సులు చేసిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగానే ఉన్నాయి. తొలుత వీరు కోర్సు పూర్తిచేయగానే ఏదైనా పరిశ్రమలో అప్రెంటీస్ చేయడానికి అర్హులు. తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాలు చేయడానికి అర్హులు. ప్రతీ సంవత్సరం ఆర్ఆర్‌బి (రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు), ఇండియన్ నేవీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, షిప్ యార్డులు, స్టీల్ ప్లాంట్స్, డాక్ యార్డ్స్, కెమికల్ ఫ్యాక్టరీస్, నిర్మాణ సంస్థల ఇత్యాదివన్నీ కూడా ఐటీఐ చేసిన ట్రేడ్ మెన్ కోసం ఉద్యోగ అవకాశాలను అందిస్తున్నాయి. అయితే ఈ ఉద్యోగాలు పొందాలంటే ఆయా ప్రభుత్వ సంస్థ నిర్వహించే ఎంపిక పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలను పక్కన పెడితే, నేడు ఐటీఐ చేసిన వాళ్లకు ప్రైవేటు సంస్థలు కూడా మంచి ఉద్యోగ అవకాశాలనే అందిస్తున్నాయి. జాబ్ పోర్టల్స్‌లో ఉద్యోగ సమాచారాన్ని నిత్యం ఫాలో అవుతూ,ఖాళీలు ఉన్నప్పుడు ఔత్సాహికులు అప్లై చేసుకోవచ్చు.



ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత

**హెల్ప్ లైన్ :** విద్యార్థులకు ఏమైన సమస్యలు ఉంటే పని దినాలలో ఉదయం 10:00గంటల 5:00 గంటల వరకు ఈ 9493535378 నెంబరును సంప్రదించాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ప్రజా గర్జన




నవతెలంగాణ-నస్పూర్

దేశంలో, రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో జూన్ 4వ తేదీన ప్రజా గర్జన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేణ శంకర్ తెలిపారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడం కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 14వ తేదీ నుండి ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ప్రజలతో మమేకమై తిరుగుతూ బీజేపీ 9 సంవత్సరాల రాజ్యాధికారాన్ని, దేశ ప్రజలకు చేసిన మోసాలను తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక రైతులు ఆత్మహత్యలు పెరిగాయని తెలిపారు. బీజేపీ నాయకులపైన కాకుండా విపక్షాల పైన సిబిఐ ఐటి దాడులు చేపడుతున్నారని మండి పడ్డారు. సీపీఐ, సీపీఎం క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తూ, ఓటు అనే ఆయుధంతో మతోన్మాదులను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ సంస్థలన్నీ అమ్మారని, సింగరేణిలో కూడా అమ్మడానికి సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు లింగం రవి, అఫ్రోజ్ ఖాన్,మొగిలి లక్ష్మణ్, బొడ్డు లచ్చన్న, దొడ్డిపట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో 2వ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. ఆదివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన వారిని నుండి దరఖాస్తులు స్వీకరించాలని, బూత్ స్థాయి అధికారులను పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచి దరఖాస్తులు తీసుకునే విధంగా తహసీల్దార్లు పర్యవేక్షించాలని తెలిపారు. మరణించిన ఓటర్లు, గ్రామము వదిలి వెళ్లిపోయిన వారు, ఒకే ఓటరు రెండుసార్లు వచ్చిన వారి పేర్లను గుర్తించి నిబంధనల మేరకు నోటీసులు జారీ చేసి వివరాలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన నాణ్యత ఓటరు జాబితా తయారు చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం, డిఆర్ఓ రాజేశ్వర్, తహసిల్దార్లు, నాయబ్ తహసిల్దార్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణానికి కృషి



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని పలు గ్రామాల రహదారుల నిర్మాణానికి తమ వంతుగా కృషి చేసినట్టు తాండూర్ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ తెలిపారు. ఆదివారం గోపాల్‌నగర్ టు కాసిపేట వెళ్లే రోడ్డుపై నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టుకు భూమి పూజ చేశారు. రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్వర్టు పూర్తయినట్లయితే రేచీని, గోపాల్‌నగర్, చంద్రపెల్లి, ద్వారకాపూర్, కాసిపేట గ్రామాలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూరు మండలంలోని ద్వారకాపూర్ కొత్తపల్లి చౌటపల్లి గ్రామాలలో బీటీ రోడ్ల నిర్మాణానికి కృషి చేసినట్టు తెలిపారు. చాకపల్లి నుండి కాసిపేట, నగరం టు రేచిని అచలాపూర్ టు కొమ్ముగూడెం బోయపల్లి బోర్డు టు కాసిపేట గ్రామాలకు సౌకర్యార్థం రీ బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్టు చెప్పారు. రోడ్ల నిర్మాణాలు పూర్తయినట్లయితే మండల వాసులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్నిట సర్పంచ్ అశ్వ రమేష్, ఉప సర్పంచ్ చీర్ల లక్ష్మీనారాయణ, గోపాల్ నగర్ నాయకులు సత్యనారాయణ, సాయి పాల్గొన్నారు.

## కౌలు రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కౌలు రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేయాలి చేయాలని బీసీ సంఘం యువజన నాయకుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది అధిక వర్షాలతో పంట దిగుబడి తక్కువగా వచ్చి అదే విధంగా పత్తి ధర తక్కువగా ఉండటంతో కౌలు రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని కౌలు రైతులకి 50 శాతం సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు అందజేసి ఆదుకోవాలని అన్నారు. అదే విధంగా జిల్లావ్యాప్తంగా ఉన్న కౌలురైతులని గుర్తించి రైతుబంధు వర్తింప చేయాలని కోరారు. జిల్లాలో అమాయక రైతులకు మోసం చేస్తూ నకిలీ విత్తనాలు అంటగడుతున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలను పూర్తి స్థాయిలో నిరోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గడ్డల ప్రణయ్, సైదం నాగరాజు, గడ్డల కరణ్, రాజేష్, విజయ్ ఆవిడపు తరుణ్ పాల్గొన్నారు.

# సివిల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన భార్గవ్

- డెంటల్‌తో సంతృప్తి చెందక.. సివిల్స్ లక్ష్యంగా అడుగులు
- 554 ర్యాంక్ సాధించిన జిల్లావాసి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీసీఐ టౌన్‌షిప్‌కు చెందిన మద్దెల ఓదేలు పద్మ దంపతులకు రెండో కుమారుడు మద్దెల బార్గవ్, ఇటీవల వెలువడిన సివిల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 554 ర్యాంక్ సాధించారు. సివిల్స్‌లో నాలుగో ప్రయత్నంలో విజయం సాధించారు. లక్ష్య సాధననే ధ్యేయంగా తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు, 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జోసెఫ్ కాన్వెంట్ స్కూల్‌లో సెకండరీ విద్యాభ్యాసం పూర్తి చేశారు. పై చదువులు హైదరాబాద్‌లో అభ్యసించారు. అనంతరం వైద్యవిద్యలో భాగంగా డెంటల్ కోర్సు పూర్తిచేశారు. అంతటితో సంతృప్తి చెందని భార్గవ్ సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వివిధ అకాడమీల్లో శిక్షణ తీసుకున్నాడు. ఇందుకు మిత్రులు సహకరించారు. సొంతంగా నోట్స్ ప్రిపేర్ చేసుకుని సాధన చేసేవాడు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, మిత్రుల ప్రోత్సాహం ఆయనలో ఆత్మస్థైర్యాన్ని నింపాయి. దీంతో మూడు సార్లు ప్రయత్నం చేసి చివరి వరకు వెళ్లిన విజయాన్ని సాధించలేకపోయాడు. అయిన నిరాశ చెందకుండా లక్ష్యవైపు అడుగులు వేసి నాలుగో ప్రయత్నంలో 554 ర్యాంక్ సాధించి తన కలను నెరవేర్చుకున్నాడు.

**డెంటల్ విభాగంలో సంతృప్తి చెందక సివిల్స్ వైపు...**

ఏదో ఒకటి సాధించాలనే తపన ఉండటంతో బార్గవ్ సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ, డెంటల్ విభాగంలో వైద్య విద్యను అభ్యసించారు. అది ఆయనకు సంతృప్తిని ఇవ్వలేదు. ఆయన లక్ష్యం సివిల్స్ సాధించడం. అందుకే ఆ వైపు అడుగులు వేశాడు. తల్లిదండ్రులు, మిత్రుల ప్రోత్సహంతో సివిల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయం సాధించాడు.





తండ్రిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

**పలువురి అభినందనలు..**

తమ సామాజిక వర్గానికి చెందిన భార్గవ్ అత్యున్నత ఉద్యోగమైన ఐఏఎస్ సాధించడం పట్ల మాల సంక్షేమ సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు యువకుడి తండ్రి మద్దెల ఓదేలును సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఓదేలు మాట్లాడుతూ కొడుకు సివిల్స్‌లో విజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బార్గవ్‌ను ఆదర్శంగా తీసుకుని, యువత చదువులో రాణించాలని కోరారు. చదువుతోనే ఏదైనా సాధించవచ్చని సూచించారు.

## భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జోగు రామన్న మౌనం వీడి రేణుకా సిమెంట్స్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూనిర్వాసితుల పక్షాన గత రెండు సంవత్సరాలుగా పోరాడుతున్నామని తెలిపారు. ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్‌ని కలిసిన ఎలాంటి స్పందన లేకపోవడంతో, ఎస్టీ కమీషన్‌కి పిర్యాదు చేశామని పేర్కొన్నారు. దీనిపై కమీషన్ ఎదుట కలెక్టర్ హాజరై, ఫ్యాక్టరీ ప్రయివేట్ వ్యక్తులకి సంబంధించినదిగా తెలిపారని అన్నారు. గత నెలలో కమీషన్ సభ్యులు జిల్లా కేంద్రానికి రాగ సమస్యను తెలపడానికి వెళ్లిన నిర్వాసితులను, అధికారులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. దీంతో భూనిర్వాసితులు తమ భూములు, తాము దున్నుకోవడానికి వెళ్లగా పోలీసులు అత్యుత్సహం ప్రదర్శించి అడ్డుకోవడం తప్పని అన్నారు. సివిల్ విషయాల్లో పోలీసులు తలదూర్చి పదే పదె అరెస్టులు చేసి భయపెడుతున్నారన్నారు. త్వరలో ఈ కంపెనీ పూర్తి వివరాలు బయట పెడతామని, ఇకనైనా జోగు రామన్న స్పందించి నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

## సంచార వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని చొప్పన్‌గూడ గ్రామ పంచాయతీలో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంచార వైద్య సేవలు గ్రామంలో కొనసాగుతోంది. ఈ వైద్య సేవలు గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని సర్పంచ్ సిడాం అన్నిగ అన్నారు. రక్త నమూనాలు సేకరించి పరీక్షల అనంతరం రోగులకు వైద్యం అందిస్తున్నారన్నారు. వైద్యశిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు మండల వైద్యాధికారి ఉప్రె వినయ్, వైద్యసిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## బహిరంగ సభకు మజ్లిస్ నాయకులు

**ఆసిఫాబాద్ :** ఆదిలాబాద్ మల్టీపర్పస్ మైదానంలో ఆదివారం నిర్వహించే బహిరంగ సభకు జిల్లా కేంద్రం నుండి ఎంఐఎం నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎంఐఎం అధ్యక్షుడు ఎండి సల్మాన్‌ఖాన్ మాట్లాడుతూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ముఖ్యఅతిథిగా సభకు హాజరవుతారని అన్నారు. మైనారిటీలు పెద్ద ఎత్తున సభకు తరలి రావాలని కోరారు. ఆదిలాబాద్ బయలుదేరిన వారిలో ఎంఐఎం కార్యదర్శి షకీల్, కోశాధికారి మొహమ్మద్ నాయకులు అజీమ్ ఉద్దీన్, ఆలి, అఫ్రోజ్, ముజాహిద్, ఐమన్, తమీమ్ కార్యకర్తలు ఉన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్




తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం తిర్పెల్లిలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, దండె విఠల్ హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజక వర్గంలో అన్ని చోట్ల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు కొనసాగుతున్నాయని అన్నారు. అందులో భాగంగానే పట్టణంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అందుకు పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాలు, అసత్యాలను తిప్పికొట్టాలని అన్నారు. తమ ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ఫలాలు దక్కుతున్నాయని స్పష్టం చేశారు. త్వరలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల వివరాలను వెల్లడించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగడుతూ ప్రజలకు కేంద్రం వైఫల్యాలను వివరించాల్సిన అవసరముందని వివరించారు. సీసీఐ పునరుద్ధరణ కోసం పోరాటాలు చేసినా కేంద్రం నుండి ఎటువంటి స్పందన లేకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రౌత్ మనోహర్, రైతుబంధు సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, పార్టీ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు స్వరూప రాణి, బొడగం మమత, బియ్యాల అనసూయ, బీఆర్ఎస్ పార్టీ బీసీ పట్టణ అధ్యక్షులు దాసరి రమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలోనే మెరుగైన విద్య

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్య అందుతుందని కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థులకు కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని అధ్యాపకులు ప్రచారం చేశారు. గ్రామాల్లో ప్రతి ఇంటికెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలలో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన మైదానం, ఉచిత పుస్తకాలు, భోజనం, స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.సురేందర్, జాడి సంతోష్, కిరణ్‌కుమార్, ముత్తయ్య పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM IX ADDI CHIEF JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD**
**MVOP. NO 2022 OF 2019**

**Between:**
Angadi Shailaja ..............Petitioner
And
Nagula Raju ......Respondents

To,
Nagula Raju S/o Sambaji Nova Telangang 06:02/06/2013 Aged Major, Occ: Business and Owner cum Driver of Maruti Suzuki Car bearing No.TS-01-UA-6326 R/o H.No. 4-21/, Pardi 'B', Kubeer, Adilabad District-504 103.. ..................Respondents

Please take Notice that the above OP is filed against you and others for grant of Compensation the Hon'ble court posted above case on 02-6-2023.at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

**(BY ORDER OF COURT)**
**M/s. P. CHANDRA MOVILI, SMT. ARUNDATHI ADVOCATES,**
H.NO. 8-1-58/5, BANGARU ENCLAVE, JYOTHINAGAR, KARMANGHAT, HYDERABAD

# మహనీయుల ఆశయ సాధనకు ఐక్యతతో ముందుకు సాగాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్



మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగు జాడల్లో నడువాలని, దళితులంత ఐక్యమత్యంతో వారి ఆశయాలను సాధించాలని తెలంగాణ దళిత ఐక్య చైతన్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ముడుసు సత్యనారాయణ అన్నారు. ఆదివారం నర్సాపూర్(జి) మండలంలోని టెంబుర్ని గ్రామంలో ఆదివారం తెలంగాణ దళిత ఐక్య చైతన్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో దళిత అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, ఎదగాలంటే చదువుకోవడం ముఖ్యమని సూచించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం స్ఫూర్తితో అభివృద్ధి బాటలో పయనించాలని పేర్కొన్నారు. జనాభా పరంగా నిర్మల్ నియోజకవర్గంలో దళితులవి 32 వేల ఓట్లు ఉన్నాయని అన్నారు. అంబేద్కర్ మనందరికీ ఓటు హక్కు కల్పించారని అన్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని స్థాపించి దళిత, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరాన్ని కాపాడిన వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రత్నం, మేరుగు రాజన్న, స్థానిక నాయకులు గంగారాం, పోశెట్టి పాల్గొన్నారు.

## ఈదురు గాలుల బీభత్సం..విరిగిపడిన చెట్లు

నవతెలంగాణ-బాసర



మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం గంట పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ఈ దాటికి తట్టుకోలేక పలు చెట్లు నేలకొరిగాయి. శారద నగర్ కాలనీలో రైల్వే స్టేషన్ నుండి బస్టాండ్ వెళ్లే ప్రధాన రహదారిపై చెట్టు నేల కొరగడంతో విద్యుత్ వైర్లపై పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.చెట్టు కింద బైక్ ఉండడంతో బైక్ సైతం ధ్వంసం అయింది. స్థానికులు విరిగిన చెట్టును తొలగించి ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. విద్యుత్ సిబ్బంది లైన్ సరిచేసి విద్యుత్ పునరుద్ధరించారు.

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్



ముఖ్యమంత్రి కేసీఆర్ సభను పార్టీ నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రేఖానాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె నివాస గృహంలో ఖానాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4వ తేదీన నిర్మల్ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ సభ ఉన్నందున కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. అలాగే తెలంగాణ దశాబ్ది వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

## సమస్యలు మానవ హక్కుల కమిషన్‌కు నివేదిస్తాం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని మారుమూల గ్రామాల ఆదివాసులు ఎదుర్కొంటున్న తాగునీటి, రోడ్డు సౌకర్యాలపై రాష్ట్ర మానవ హక్కుల వేదిక కమిషన్ దృష్టికి తీసుకు వెళతామని ఏఐసీసీ రాష్ట్ర రీసెర్చ్ కోఆర్డినేట్ వినోద్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మామిడిగూడ(జి), సాలెగూడ, జైత్రం తండ, దనోర(బి), ఖైర్‌గూడ తదితర ఆదివాసుల గూడెల్లో తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారని అన్నారు. మిషన్ భగీరథ తాగునీరు దొరక్క కిలోమీటర్ల దూరం వెళ్లి చెలిమల నీళ్లు తెచ్చుకుంటున్నా, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లిన స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని యెడల హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.దేశాయ్, భావు, శ్రీనుగౌడ్ పాల్గొన్నారు.

## నూతన ఎస్సైని ఘనంగా సన్మానించిన నాయకులు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బదీలిపై వచ్చిన ఎస్సై రవీంధర్‌ను ఆదివారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడేందుకు ఎల్లవేళలా కృషిచేస్తానని, పారదర్శకంగా విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు కోంద్ర రమేష్, ఎంపీటీసీ మల్లేష్, కోఆప్షన్ సభ్యులు ఫసీ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శంకర్, బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు మజార్, సోషల్ మీడియా కన్వినర్ చింటు, సాగర్, ఎస్సై పడ్వాల్ రవీందర్‌ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కటకం భూమారెడ్డి, అల్లి(కె) సర్పంచ్ రజిని సుధాకర్, నాయకులు నారాయణరెడ్డి, దత్తురాం, దేవేందర్ పాల్గొన్నారు.

## బోనాలు ఎత్తి నిరసన తెలిపిన వీఓఏలు



నవతెలంగాణ-ముథోల్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఐకేపీ వీఓఏలు బోనాలు ఎత్తి తమ నిరసనను తెలియజేశారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి మహాలక్ష్మి ఆలయం వరకు బోనాలతో భాజభజంత్రీల మధ్య ర్యాలీగా వెళ్లి స్థానిక మహాలక్ష్మి ఆలయంలో బోనాలు సమర్పించారు. సీఎం కేసీఆర్ మనసు మరాలని మొక్కుకున్నారు. చాలీచాలని గౌరవేతనం రూ.3వేల 900తో సుమారు 20 సంవత్సరాల నుండి వీఓఏలుగా పనిచేస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రతినెల తమ అకౌంట్‌లో వేతనాలు వేయాలని అన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు కల్పించాలని అన్నారు. 40 రోజుల నుండి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా పెద్ద మనసుతో సీఎం సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. వీరికి ముథోల్, బాసర మండలాల నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు వచ్చి తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో ముథోల్, బాసర మండలాల ఐకేపీ వీఓఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా మురళీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-నిర్మల్

పట్టణంలోని గాంధీ చౌక్ కాల్వగడ్డలోని శ్రీ మురళీకష్ణ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమంలో మంత్రితో పాటు మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్ పాల్గొన్నారు. ఇందులో డీసీసీబీ మాజీ చైర్మెన్ రాంకిషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, కౌన్సిలర్ ఏడిపెల్లి నరేందర్ ఉన్నారు.

## కాళేశ్వరం పనుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం

నవతెలంగాణ -ముథోల్

ముథోల్ నియోజకవర్గంలో నేటికి కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కాకపోవడం అన్యాయమని ముథోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు మోహన్ రావుపటేల్ అన్నారు. మండలంలోని చించాల, తరోడ తాండా,తరోడ, గ్రామంలో పల్లె పల్లెకు బిజెపి- గడపగడపకు మోహన్‌రావు కార్యక్రమంను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో బీజేపీ జెండాను ఆవిష్కరించారు అనంతరం గడపగడపకు కేంద్ర ప్రభుత్వం పథకాలను తెలియజేశారు. అనంతరం గ్రామ కూడళ్ళు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముథోల్ నియోజకవర్గంలో సంవత్సరంలు గడుస్తున్న కాళేశ్వర ఎత్తిపోతల పథకం పనులు నేటికీ పూర్తి కావడంలేదని అన్నారు. సీఎం కేసీఆర్ అర్హులైన పేదలకు డబుల్ బెడ్ ఇండ్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, ఉపసర్పంచ్ సందీప్, నాయకులు లక్ష్మన్ ,సర్వేస్, భీమెందర్, సాయినాథ్ గౌడ్, యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- లక్ష మందితో సీఎం భారీ బహిరంగ సభ
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

సమీకృత కలెక్టరేట్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు జిల్లాకు వస్తున్న సీఎం కేసీఆర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి నూతన సమీకృత కలెక్టరేట్ సముదాయం, కొత్తగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని, బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని, హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మల్ జిల్లా కేంద్రంలో లక్ష మందితో నిర్వహించే భారీ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని అన్నారు. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో ఎల్లపల్లి గ్రామ శివారులోని క్రషర్ రోడ్‌లో అనువైన స్థలంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. గత 9 సంవత్సరాలుగా ప్రజలకు అందిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారని మంత్రి తెలిపారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు సీఎం కేసీఆర్ నూతన జిల్లాలు ఏర్పాటు చేసి, ప్రతీ జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ సముదాయ భవనాలను నిర్మించారని తెలిపారు. సీఎం కేసీఆర్ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జూన్ 2 వరకు అన్ని పనులు పూర్తి చేయాలని, సభకు వచ్చే ప్రజలు, ప్రజా ప్రతినిధుల కోసం అవసరమైన మేర పార్కింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# అనుమతులు లేకుండానే టేకు చెట్ల నరికివేత



అనుమతులు లేకుండా నరికేసిన టేకు దుంగలు

నవతెలంగాణ- బజార్‌హత్నూర్

మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాల ముందు నిర్మిస్తున్న ఫారెస్ట్ నూతన భవన నిర్మాణాలకు టేకు కట్టే అవసరం కావడంతో సదరు గుత్తేదారుడు ఫారెస్ట్ ఉన్నతాధికారుల పేరు చెప్పి ఇష్టానుసారంగా అనుమతులు లేకుండానే టేకు చెట్లను నరికిన సంఘటన మండలంలోని భూతాయి గ్రామంలో చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరుతో గ్రామాలలో మొక్కల పెంపకం తో పచ్చదనం చేస్తుంటే మండల ఫారెస్ట్ అధికారులకు వర్తించినట్టుగా సదరు గుత్తేదారులకు వత్తాసు పలుకుతున్నారు. పై అధికారులకు చెప్పడం జరిగిందని మాట దాటేస్తున్నారు. సామాన్యులు చిన్నపాటి ఇల్లు నిర్మిస్తే ఫారెస్టు, రెవిన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలని నిబంధనలు చెబుతుంటారు. ప్రభుత్వ భవనానికి మాత్రం ఎటువంటి అనుమతులు అవసరం లేదని చెప్పడం విడ్డూరంగా ఉంది. అభివృద్ధి పేరు చెప్పి వ్యాపారం చేసుకుంటున్నారని ఈ భవన నిర్మాణం గురించి తెలిసినవారు మాట్లాడుకుంటున్నారు. అనుమతులు లేకుండా టేకు చెట్లను నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల మండల వాసులు కోరుతున్నారు.

# ప్రజల కోసమే పోలీసులు : సీఐ

నవతెలంగాణ- ముథోల్



ప్రజల కోసమే పోలీసులు పనిచేస్తారని ముథోల్ సిఐ వినోద్‌రెడ్డి అన్నారు. మండలంలోని మచ్కల్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కమ్యునిటి కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పోలీస్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు.ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదని,చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని అన్నారు.గ్రామాలలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారాన్ని అందించాలన్నారు.సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఫోన్ ద్వారా ఓటీపీ చెప్పకూడదన్నారు.ప్రతి ఒక్కరూ చట్టాలపై అవహహన కలిగి ఉండాలన్నారు.గ్రామంలో అందరూ కలిసి మెలసి ఉండాలని,యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సరైన వాహన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు 55,ట్రాక్టర్లు 5,ఆటోలు 5,కార్లు 2 ను స్వాధీనం చేసున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశ్విని మైసాజి, ఎస్సైలు సాయి కిరణ్, సాయికుమార్,మహేష్, విక్రమ్,ఏ ఎస్సైలు ,పోలీస్ కానిస్టేబుల్ , సిబ్బంది, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

పట్టణాభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. కేంద్రం నుండి నిధులు వస్తున్నాయని దుష్ప్రచారాలు చేస్తున్న బీజేపీ నేతలు భూమిపూజ కార్యక్రమాలకు ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక 40 వ వార్డు పరిధిలో రూ.40లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుపై చర్చించి పలు సూచనలు చేశారు. అంతకుముందు స్థానికులు అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వాల హయంలో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతలు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ప్రజలకు కనీస మౌలిక వసతులను కల్పించడంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. గత తొమ్మిదేళ్ళ కాలంలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్ భరత్, నాయకులు రాంకుమార్, గంగారెడ్డి, ఇజ్జగిరి అశోక్, కుమ్ర రాజు, ఆసిఫ్ పాల్గొన్నారు.

# దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జూన్ 2 నుంచి 22 వరకు ప్రభుత్వం పండుగ వాతావరణంలో నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు, చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఏర్పాటు నుంచి తొమ్మిది సంవత్సరాల కాలంలో ఆయా శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వివిధ వర్గాల ప్రజలకు చేకూర్చిన లబ్ది, సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా ప్రగతి నివేదికలు తయారు చేయాలని సూచించారు. ముఖ్య కూడళ్లను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు, అపశ్రుతులకు తావులేకుండా అట్టహాసంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తూ, అన్ని వర్గాల ప్రజలు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యేలా చూడాలని అన్నారు. ఉత్సవాల్లో భాగంగా జూన్ 2న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరుగుతాయని అన్నారు. 3న అన్ని రైతు వేదికల్లో రైతు దినోత్సవం జరపాలని, ప్రతి చోట కనీసం వేయి మంది రైతులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందస్తు పంట వేయాల్సిన ఆవశ్యకత, ఆయిల్ పామ్ సాగుతో సమకూరే లాభాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులు పాల్గొని, రైతు దినోత్సవం విజయవంతానికి కృషి చేయాలని అన్నారు. 4న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్షా దివస్, 5న విద్యుత్ విజయోత్సవం, 6న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ కారక్రమాలను నిర్వహించాలని వివరించారు. చెరువుల వద్ద ఉత్సవాలు జరిగే సమయంలో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 9న తెలంగాణ సంక్షేమ సంబరాలను, 10న తెలంగాణ సుపరిపాలన దినోత్సవాన్ని, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం, 15న పల్లె ప్రగతి దినోత్సవం, 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 17న తెలంగాణ గిరిజనోత్సవం, 18న తెలంగాణ మంచినీళ్ల పండుగ, 19న తెలంగాణ హరితోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి గ్రామ పంచాయతీ, ప్రతి మున్సిపల్ వార్డులో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని తెలిపారు. 20న తెలంగాణ విద్యా దినోత్సవంలో భాగంగా అన్ని కళాశాలలు, పాఠశాలల్లో జెండాను ఎగురవేయాలని అన్నారు. విద్యాలయాలను అందంగా ముస్తాబు చేయాలని అన్నారు. విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేయడంతో పాటు వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. మన ఊరు మన బడి పనులు పూర్తయిన చోట పాఠశాలలను ప్రారంభోత్సవాలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 21న తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా ఆలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలను అలంకరింపజేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేలా చూడాలని అన్నారు. 22న అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. మూడు వారాల పాటు కొనసాగే దశాబ్ది ఉత్సవాలను అన్ని శాఖల సహకారంతో విజయవంతం చేయాలని అన్నారు.

**సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి...**

జూన్ 4న నూతన సమీకృత కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారని అందుకు సంబంధిత అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొత్త కలెక్టరేట్ ప్రారంభోత్సవం ముందురోజు డెకరేషన్, లైటింగ్స్ అమర్చాలని ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏరియాలో పెయింటింగ్ వేయాలని అన్నారు. సీఎం వచ్చే రూట్లలో పరిశుభ్రత పాటించాలని అన్నారు. భారీ బందోబస్తు, బారికేడింగ్ ఏర్పాట్లను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేస్తారని అన్నారు. మంచిర్యాల ఎక్స్ రోడ్ నుంచి కొండాపూర్ ఎక్స్ రోడ్ వరకు ఎవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో లోకేష్, ఆర్డీఓ స్రవంతి, అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 100సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ సీహెచ్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అంతకుముందు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మంత్రి మొక్కలు నాటారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానమని అన్నారు. దేశంలోనే అతిపెద్ద కమాండ్ కంట్రోల్‌ను సీఎం కేసీఆర్ నేతృత్వంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు వలన దొంగతనాలకు ఆస్కారం లేదని అన్నారు. ఇటీవల నిర్మల్ చుట్టుపక్కల గల ఒక బ్యాంకులో దొంగతనం జరిగిందని దాన్ని పోలీసులు ఐదు రోజుల్లో చేధించారని తెలిపారు. పట్టణంలో ఏం అనర్థాలు జరుగుతున్నాయో, సీసీ కెమెరాల వల్ల పోలీసులకు వెంటనే తెలిసిపోతాయని అన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు బాధ్యతయుతంగా ఉండి పోలీసులకు సహకరించాలని సూచించారు. అనుమానస్పద వ్యక్తులు కనబడిన సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ రాంకిషన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు మల్లేష్ శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్, పట్టణ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు

నవతెలంగాణ- ఖానాపూర్

దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు శత జయంతి వేడుకలను ఖానాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఖానాపూర్ పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ నివాళలర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు వాడి పేరు ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మహా నాయకుడు అని గుర్తు చేశారు. ఇలాంటి గొప్ప నాయకుడు తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పుడు ఉంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వీరాభిమాని కొండాజి సాయి ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ రాము నాయక్, అంకం రాజేందర్, శంకర్ రాజ్, గంగన్న, ప్రదీప్ తదితరులున్నారు.

## ప్రభుత్వం బీసీ రుణాల కోసం స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వాలి



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వం బీసీ రుణాల కోసం స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018లోనే జిల్లా వ్యాప్తంగా 10 వేల మంది బీసీ రుణాల కోసం దరఖాస్తులు పెట్టుకోగా అందులో నుంచి వేయి మందిని అనర్హులుగా ప్రకటించారని తెలిపారు. 9 వేల మందిలో వేయి మందికి రూ.50 వేల చొప్పున బీసీ రుణాలను ప్రభుత్వం అందించిందన్నారు. మరో 8 వేల మందికి బీసీ రుణాలు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల వారికి లక్ష రూపాయల చొప్పున రుణాలు అందిస్తామని ప్రకటించడం బాగున్నా గతంలో బీసీ రుణాల కోసం దరఖాస్తు పెట్టుకున్నవాళ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలు ప్రకటించాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ మావల మండల కార్యవర్గ సమావేశాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రవియాదవ్, మండల ఇన్‌చార్జీ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ ఉష్కం రఘుపతి, నాయకులు భూమేష్, ఎంబడి సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, చహకటి కిరణ్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన మంత్రి

నవతెలంగాణ-నిర్మల్

నందమూరి తారకరామారావు శత జయంతి సందర్భంగా ఆదివారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి జిల్లా కేంద్రంలోని జయశంకర్ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆరాధ్య దైవమని, తామంతా ఆయన వీరాభిమానులమని అన్నారు. చిన్ననాటి రోజుల్లో ఆయన సినిమాలు అన్ని చూసే వాళ్లమని, విభిన్న పాత్రలలో ఆయన నటించారని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మెన్ రాంకిషన్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, భూషన్‌రెడ్డి, కౌన్సిలర్లు నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 29 మే 2023



## దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ- కోటపల్లి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లను జిల్లా జడ్పీ కో ఆప్షన్ సభ్యులు అజ్గర్ ఆదివారం రొయ్యలపల్లి, ఎదుల బంధం గ్రామాలలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో ప్రజలు మమేకమై పాల్గొనాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం సమీక్ష సుభిక్షంగా ఉందని అన్నారు. ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త సంక్షేమ పథకాలు పనితీరును ప్రజలకు చేరవేయాలని ఉన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ

నవతెలంగాణ- తాండూర్



గ్రామపంచాయతీ అనుమతి లేకుండా అక్రమాలు చేపడితే గ్రామపంచాయతీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని రేచిని గ్రామపంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ తెలిపారు. రేచిని గ్రామపంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా నిర్మిస్తున్నటువంటి అక్రమ ఇంటి నిర్మాణాలను అడ్డుకొని యజమానులకు నోటీసులు అందజేశారు. గ్రామపంచాయతీ పరిధిలో నిర్మాణాలు చేపట్టే వారు గ్రామపంచాయతీ అనుమతి పొందాలన్నారు. పంచాయతీలు అనుమతి లేని నిర్మాణాలకు ఇంటి నెంబర్లు కేటాయించడం కుదరదని తెలిపారు.అక్రమ ఇంటి నిర్మాణాలకు ఎలాంటి వాల్యుయేషన్ ఉండదని పేర్కొన్నారు.

## అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు




నవతెలంగాణ-సిర్పూర్(టి)

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జరుగుతుందని కౌటాల సీఐ సాదిక్‌పాషా అన్నారు. శనివారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కౌటాల సీఐ సాదిక్‌పాషా మాట్లాడుతూ మండలంలోని పెద్దబండ శివారులో ఉన్న భీమన్న ఆలయం అటవి ప్రాంతంలో పేకాట స్థావరాలపై పోలీస్ సిబ్బందితో దాడులు చేసినట్టు తెలిపారు. ఈ దాడిలో 14 మందిని పట్టుకొని వారి వద్ద నుండి రూ.13.11 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే పేకాట, ఆన్‌లైన్ మక్కా, జూదం, ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ లాంటి ఆటలు ఆడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ దాడిలో సిర్పూర్ ఎస్సై దీకొండ రమేష్ పాల్గొన్నారు.

## దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని స్థానిక చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర నుండి గోలేటికి తీసుకెళ్తున్న 76 దేశీదారు బాటిళ్లు పట్టుకున్నట్టు వాంకిడి ఎస్సై సాగర్ తెలిపారు. రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామంలో గల బసంతినగర్‌కు చెందిన జాడి కేశవ్‌పై కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

## కాంటా చౌరస్తాలలో చలివేంద్రం ఏర్పాటు



నవ తెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని స్థానిక కౌంట చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద బెల్లంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు నాతరీ స్వామి ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారుద. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మల్లారం చిన్న రాజాం రిబ్బన్ కట్ చేయగా, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బెల్లంపల్లి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండి ప్రభాకర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు తొంగల మల్లేష్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, ఎండీ ఆఫ్జల్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎలుక ఆకాష్, ఎండీ గౌస్, గుజ్జ కృష్ణ, కనుకుంట్ల రాజేష్, సమ్మిరెడ్డి, సాయి కిరణ్, మొండయ్య, అజీమ్ పాల్గొన్నారు.

## దశాబ్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-రామకష్టాపూర్

పట్టణంలో తెలంగాణ దశాబ్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక వివిధ వార్డుల్లో కౌన్సిలర్ల అధ్యక్షతన ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇంచార్జ్ గాండ్ల సమ్మయ్య మాట్లాడుతూ జూన్ 2 నుండి 22 తేది వరకు ఈ ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహించుకోవాలని ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సుదర్శన్ గౌడ్,జాడి శ్రీనివాస్, కోఆర్డినేషన్ కమిటి సభ్యులు, జక్కబోయిన కుమార్,బత్తుల శ్రీనివాస్ ,ఆయా వార్డుల కౌన్సిలర్లు, మహిళ, యూత్, విద్యార్థి నాయకులు సోషల్ మీడియా, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ- తాండూర్

బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మన హరీష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో తాండూరు మండలం నాయకులు పలు రాజకీయ తీర్మానాలు చేశారు. పట్టాలు ఉండి భూమి లేని ఎస్సీ, ఎస్టీలకు భూములు ఇవ్వాలని, ఐబి సెంటర్లో సులబ్ కాంప్లెక్స్ నిర్మించాలని మండలంలో 108 అంబులెన్స్‌ను వెంటనే ఏర్పాటు చేయాలరని తీర్మాణించారు. ఈ సందర్భంగా హరీష్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలో నరేంద్ర మోదీ గారు 9 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మే 30 నుండి జూన్ 30 వరకు మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాల పై మండల నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత 9 సంవత్సరాల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకష్ణదేవరాయలు, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, జిల్లా నాయకులు కేశెట్టి విజయ్‌కుమార్, శేషగిరి, సుధీర్‌గౌడ్, చిరంజీవి, తుకారాం మండల నాయకులు శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి పరీక్షా కేంద్రం ప్రారంభం

- తల్లిదండ్రుల స్మారకార్థం ఏర్పాటు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్‌లో గొంది సరోజమ్మ బుచ్చన్న స్మారకార్థం వారి కుమారుడు గొంది వెంకటరమణ ఉచిత కంటి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించనున్నట్టు తెలిపారు. నేటి నుంచి సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఉచిత కంటి పరీక్షా కేంద్రంలో కాసిపేట మండలంలోని దేవాపూర్‌తో పాటు మండలంలోని పేదలకు కంటి సమస్యలు ఉన్న వారికి నిత్యం ఉచిత కంటి పరీక్షలతో పాటు ఉచిత ఆపరేషన్లు చేయించడం, ఆపరేషన్ చేసుకున్న వారికి ఉచితంగా మందులతో పాటు కంటి అద్దాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. నైపుణ్యత కలిగిన వైద్యులతో కంటి వైద్య సేవలను అందిస్తామని అన్నారు. ఉచిత కంటి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# సివిల్స్ ర్యాంకర్ రేవయ్య జిల్లాకే గర్వకారణం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న




నవతెలంగాణ-రెబ్బెన

ఇటీవల విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో కుమురంభీం జిల్లా రెబ్బెన మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన డోంగ్రి రేవయ్య 410వ ర్యాంకు సాధించటం జిల్లాకే గర్వకారణమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రేవయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రేవయ్య తల్లి మధ్యాహ్నభోజనం కార్మికురాలని, కష్టజీవుల కష్టం తెలిసిన వారు అధికారులైతే వారికోసం పనిచేయడానికి అవకాశముంటుందన్నారు. రేవయ్య తండ్రి చిన్న తనంలోనే చనిపోయారు. మధ్యాహ్నభోజన పథకంలో తల్లి పనిచేస్తూ ముగ్గురు పిల్లలను చదివించారు. రేవయ్య భవిష్యత్తులో పేద ప్రజల కోసం కార్మికులకు మేలు చేసే విధంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా రేవయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో పేద ప్రజల కోసం నేను నా ఇంటర్ తర్వాత దాతల సహకారంతో ట్రిపులైటి చదివానని, వారందరికి రుణపడి ఉంటానని, చదువు విలువను మారుమూల ప్రాంతాల విద్యార్థులకు తెలిసే విధంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో యువకులు ఏదైతే లక్ష్యం ఎంచుకొని ముందుకుసాగుతామో దానిని పట్టు విడువకుండా సాధించే వరకు వదిలిపెట్టద్దని యువకులకు సందేశమిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సతీష్ పాల్గొన్నారు.

# వందకు పైగా ర్యాంపు వెల్‌లు నిర్మించాం

- ఎఫ్‌డీఓ మాధవరావు..



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ డివిజన్ లోని తాళ్లపేట, జన్నారం రేంజ్ పరిధిలో వందకు పైగా ర్యాంపు వెల్‌లు నిర్మించి జంతువుల దాహార్తిని తీరుస్తున్నామని జన్నారం ఎఫ్‌డీఓ మాధవరావు అన్నారు. ఆదివారం కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని 2 రేంజ్‌లలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులతో ఎడ్యుకేషనల్ టూర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్ల పేట రేంజ్ పరిధిలోని, తపాలాపూర్ అటవీ అడవిలో జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని, రాబిట్ పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోలార్ పంపుల ద్వారా కుంటలను నింపి జంతువులకు నీటి సౌకర్యం కల్పించామన్నారు. బేస్ క్యాంప్ సిబ్బంది అటవీ అధికారులతో నిత్యం గస్తీకాస్తు, కలప అక్రమ రవాణాను నిరోధించామన్నారు. పర్యాటకులను ఆకట్టుకోవడానికి అక్కడక్కడ వాచ్ టవర్లను నిర్మించామన్నారు. దీంతో కవ్వాల్ టైగర్ జోన్‌లో పర్యాటకుల తాకిడి పెరిగిందన్నారు. అడవిని సంరక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్కడక్కడ చెక్‌డ్యాములను ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెరిగే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓలు ఆఫీసుద్దీన్, సతీష్ ఎఫ్‌బీఓలు ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

# ఘనంగా యాదవ శంఖారావం




నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పెండ్లి అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో యాదవుల శంఖారావం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, షాద్ నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, గొర్రెల మేకల అభివద్ధి కార్పొరేషన్ ఛైర్మెన్ బాలరాజు యాదవ్, టూరిజం శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, యాదవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అరిగేల నాగేశ్వర్ రావు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవులు ఐక్యంగా ఉండి అభివృద్ధి చెందలని ఆకాంక్షించారు. యాదవులు రాజకీయంగా సామాజికంగా, ఆర్థికంగా, అభివృద్ధి చెందాలన్నారు. గొర్రెల పంపిణి ద్వారా యాదవులు ఆర్థిక అభివృద్ధి చెందు తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు యాదవులకు అత్యధిక అవకాశాలు ఇవ్వాలన్నారు. అంతకుముందు శంఖారావం సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓగ్గు కళాకారులు నృత్యాలు చేస్తూ నిర్వహించిన ర్యాలీ పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గడ్డం సతీష్ యాదవ్, గిరవెన సంపత్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేశ్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్, అరిగెల పద్మ యాదవ్, పల్లె తిరుమల యాదవ్, అల్లంల నాగన్న యాదవ్, గోపు లింగన్న యాదవ్, పుర్ర కుమార్, పుట్ట లావణ్య, ఆవుల సురేష్, నాగభూషణం, గట్టయ్య యాదవ్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

నవతెలంగాణ- నస్పూర్

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలు ఆ పార్టీ నాయకులు శ్రీరాంపూర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తలారి రాజు జెండా ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం టీఎన్టీయూ రాష్ట్ర కార్యదర్శి కుంచె భూపతి, టిఎన్టిఈసి నాయకులు పెద్దపల్లి శంకర్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కమ్మ కులస్తుల సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు మల్లికార్జునరావు,ఉపాధ్యక్షుడు జగదీష్, సెక్రటరీ జమదగ్ని, ట్రెజరరి మురళీధర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం టిడిపి నాయకులు మాట్లాడుతూ రామారావు 1982 మార్చి 29న తెలుగుదేశం రాజకీయ పార్టీ స్థాపించి కేవలం 9 నెలల్లోనే ఆంధ్రప్రదేశ్లో అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. ఆ రోజుల్లోనే పేదలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలు అమలుపరచడంలో ఎన్టీఆర్ తర్వాతే ఎవరైనా అని కొనియాడారు.తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లిన నాయకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకురాలు కొయ్యడ పద్మ,తెలుగు యువత జిల్లా కార్యదర్శి ఆవుల సుధాకర్, టిడిపి నాయకులు పెంటయ్య,సంకురి భూమన్న,టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు జక్కుల రాజేశం,నాగరాజు, పవన్ కుమార్,కాంగ్రెస్ నాయకులు కంఠం సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్‌లో...



మందమర్రిలో...

**మందమర్రి :** దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మందమరి పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి కేక్‌కట్ చేశారు. పట్టణ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు ఎస్సీ. ఎస్టీ, బీసీ, మైనారిటీ బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగే విధంగా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ అందేలా ఆడవారికి ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహా నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మందమర్రిలో మినీ మహానాడు నిర్వహించి విజయవంతం చేసిన ప్రజలకు చెన్నూరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఎన్టీఆర్ కల సాకారం చేసే విధంగా ప్రతి పేదవానికి న్యాయం జరిగే విధంగా సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో చెన్నూరు గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండాను రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మందాటి రాజిరెడ్డి, పట్టణ ప్రచార కార్యదర్శి సిగ్గెం రవికుమార్, సహాయక కార్యదర్శి పిల్లి శంకర్, మహిళా నాయకురాలు మమత, పట్టణ యువత ఎరుకల శ్యామ్, సోషల్ మీడియా ఇంచార్జ్ పాసికంటి హరి, చింటూ, శాస్త్రాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సభతో బీఆర్ఎస్ సత్తా చాటాలి



నవతెలంగాణ- లక్షెట్టిపేట

వచ్చే నెల 9న జరుగనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభతో జిల్లాలో బీఆర్ఎస్ సత్తా చాటాలని ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విశ్రాంత భవన్ ఆవరణలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నస్పూర్‌లోని నూతన కలెక్టరెట్ భవన సముదాయాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామ స్థాయి నుంచి ప్రజలు అధిక సంఖ్యలో సీఎం సభకు హాజరయ్యేలా స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే మార్గనిర్దేశం చేశారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో నడిపల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్ రావు, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, డీసీఎంస్ చైర్మన్ తిప్పని లింగయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మాజీ డీసీఎంస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి,నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాగర్జన సభను విజయవంతం చేయండి



నవతెలంగాణ-తాండూర్

జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించనున్న సీపీఐ ప్రజా గర్జన సభను జయప్రదం చేయాలని బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రెగుంట చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ మండల కమిటీ నాయకులతో కలిసి ఆదివారం ప్రజా గర్జన బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సదర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహా గర్జన బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొత్తగూడెంలో లక్ష మందికిపైగా జన సమీకరణతో ఈ యొక్క బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు, కర్షకులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ ప్రజా గర్జన సభ విజయవంతం చేయడం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టే దిశగా ఈ ప్రజాగర్జన సభ దోహదపడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు, బెల్లంపల్లి నియోజకవర్గ సహాయ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు మామిడల రాజేశం, మండల కార్యదర్శి సలిగామ సంతోష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ నాయకులు భయ్యా మొగిలి, ఆనంద్, ప్రహలాద్, సన్యాసి, ఎడ్ల బాపు, భీమేష్, కంబాల రాజు, భీమన్న, నెల్లూరి తిరుపతి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**రామకృష్ణాపూర్/మందమర్రి :** పట్టణంలోని స్థానిక కాకతీయ కాలనీకి చెందిన ఎల్కపెల్లి మోషేయ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రాజా రమేష్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, దశదిన కర్మకు కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆకనపల్లి సురేష్, ఉప్పులపు సురేష్, జగదీష్, వంశి, రాజకుమార్, ప్రకాష్, పప్పు రాజు, పూర్ణ చందేర్, ప్రేమ్‌చంద్, వర్మ, కిట్టు, శివ కృష్ణ, శుషంత, లక్ష్మణ, అశోక్ పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**రామకృష్ణాపూర్ :** పట్టణంలోని స్థానిక సీవీరామన్ ఉన్నత పాఠశాలలలో ఆదివారం మాల కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా జిల్లా మాల మహానాడు అధ్యక్షులు గజ్జెల్లి లక్ష్మణ్, మున్సిపల్ చైర్మన్ జంగం కళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాల కులస్తులను అన్ని రంగాలలో రాణించేలా కృషి చేస్తూ కుల సంఘం బలోపేతానికి సమిష్టి కృషి చేయాలని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పెరుగుదలకు తనవంతు కృషి చేస్తామని అన్నారు. మాల మహానాడు పట్టణ అధ్యక్షుడిగా నల్లాల మురళి, ప్రధాన కార్యదర్శిగా బత్తుల శ్రీనివాస్, కోశాధికారిగా సంకె లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులుగా మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, గౌరవ ముఖ్య సలహాదారులుగా బైరమళ్ళ మొగిలయ్యను నియమితులు అయ్యారు.

## నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలం

**సిర్పూర్(టి):** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇండ్లు మంజూరు చేయడంలో తీవ్రంగా వైఫల్యం చెందిందని బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం మండంలో చేపట్టిన పల్లెపల్లెకు పాల్వాయి, గడపగడపకు బీజేపీ పాదయాత్ర 20వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టి 10 ఏండ్లు కావస్తున్నా సామాన్య ప్రజల సమస్యలు పరిష్కరించడంలో గోరంగా విఫలమైదన్నారు. ఏ ఒక్క నిరుపేదలకు ఇండ్లు మంజూరుచేయలేదని, ఎక్కడ చూసిన పాల్వాయి పురుషోత్తంరావు, రాజ్యలక్ష్మి హయాంలో నిర్మించిన ఎర్రగూన ఇండ్లే దర్శనమిస్తున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు మచ్చుకైన కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతి నిరుపేదకు రూ.మూడు లక్షలతో స్లాబు ఇల్లు కట్టించే బాధ్యత తీసుకుంటానని, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపిస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎలుములె శంకర్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, విశ్వేశ్వరయ్య, దెబ్బటి శ్రీనివాస్ పాల్గొన్నారు.